# శ్రీధర

# 'ఫిర్ మిలేంగే'...

ఇదంతా అసలు చాలా చిత్రంగా మొదలైంది


ఆఫీసరుతో పోట్లాడి చిర్రెత్తుకొచ్చి సగం రోజుకు శెలవు కాగితం రాసి వాడి మొహానపారేసి, బయటకొస్తే,-అసలే కోపంతో ఉడికి పోతున్న వాడ్ని, మండిపోయే ఎండ మరింత రెచ్చ గొట్టింది. ఏకబిగిని రెండు కూల్ డ్రింక్ లుతాగినా మనసులో కోపం తగ్గలేదు. కడుపులో తాపం తగ్గలేదు. ఆ సమయంలో ఏ మాత్రం ఎరుగున్న వాడు కనపడి పలకరించినా చెంప ఛెళ్ళున పగల కొట్టెయ్యాలన్నంత ఆవేశంగా ఉంది.

ఆ చిరాకుతోనే, విసుగుతోనేవచ్చి బస్ స్టాప్ లో నిలబడ్డాడు. జేబు గుడ్డతో ముహం తుడుచుకుని పక్కకు తిరిగి చూశాడు.

సరిగ్గా అప్పుడే ఆమె అతన్ని చూసింది!

అంతే—

అప్పటిదాకా సూనెలో వేగుతున్న మిరపకాయ బజ్జీలా సెగలు పొగలు కక్కినవాడు, ఒక్కసారిగా ఐస్ గడ్డలా అయిపొయ్యాడు.




అసలా ఎండ అంతా ఏమైందోగాని క్షణంలో నల్లని మబ్బులు కమ్ముకొచ్చాయి. చల్లని చినుకులు రాలాయి.

సభ్యత మాట పూర్తిగా మర్చిపోయి, అలాగే చూస్తూ నిలబడ్డాడు. ఆమె కూడా రెండు సార్లు ఇతని వంక సూటిగానే చూసింది.

కాసేపు బస్సుకోసం చూసింది. బస్సురాలేదు గానీ. ఆటో వచ్చింది. ఆమె అందులో వెళ్ళి,

పోయింది. ఆమె ఉన్నంతదాకా మబ్బుల పందిరి పరిచినట్లున్న ఆ బస్‌స్టాప్ మళ్ళీ మండుతున్న కొలిమిలా భగ్గుమంది.

ఆ రోజు ఫిబ్రవరి పదో తేదీ. రాత్రి డైరీలో ఆఫీసరు గారితో వచ్చిన తగూ గురించి పేజీ నిండా రాసి, చివరి లైనులో మాత్రం ఆమె గురించి రాయకుండా ఉండలేక పోయ్యాడు- సామ్రాజ్యాలు జయించిన చక్రవర్తులు కూడా



ఆమె సౌందర్యం ముందు పాదాక్రాంతు లవుతారు-అని.

జీవితంలో చాలా మంది ఎదురవు తుంటారు. వాళ్ళందరి గురించీ పట్టించుకోం. అలాగే అతనూ ఆమె గురించి మర్చి పోయ్యాడు.

విజయవాడనుంచి ప్రసాద్ వచ్చాడు. లాడ్జి నుంచి ఫోను చేస్తే వెళ్ళాడు.అరాత్రికిప్రయాణమై వెళ్తుంటే వాడ్ని సాగనంపటానికి బస్ డిపోకు వెళ్ళాడు. అక్కడ బుక్‌స్టాల్ దగ్గర నిలబడి పుస్తకాలు చూస్తుంటే పక్కన ఎవరో వచ్చి నిల బడ్డారు. తలెత్తి చూస్తే ఆమే!

చూడగానే గుర్తు పట్టాడు. కానీ ఆమె పోల్చు కుందా? ఏమో? ఎలాంటి భావమూ కనిపించలేదు. పుస్తకాలు చూస్తూ ఆమె కూడా అక్కడే నిలబ డింది కొద్ది నిముషాలసేపు. సినిమా పత్రిక 'మూవీ' కొనుక్కుంది.

ఈమె ఏ ఊరు వెళ్తుందో? ఎప్పుడొస్తుందో?

తెనాలి వెళ్ళేబస్సు దగ్గర నిలబడింది. లోపల కూర్చున్న వాళ్ళతో మాట్లాడుతోంది. రక్షిం చింది. తనలాగే ఎవరికో సెండాఫ్ ఇవ్వటానికి వచ్చిందన్నమాట. ప్రసాద్ వాసన పట్టాడు. కథా వస్తువా అన్నాడు. ఇంకా ఏం చెప్పలేనన్నాడు. విజయవాడ బస్సు వెళ్ళిపోయింది. అయినా అతను అక్కడ్నించి కదలలేకపోయాడు.

ఆమె మాత్రం అతనివైపు మళ్ళీ చూడలేదు— కనీసం అతను చూస్తుండగా. తెనాలి బస్సు సాగ నంపాక ఆమె ఇవతలికి వచ్చింది. వెంట ఒక వయసు మళ్ళిన వ్యక్తి ఉన్నాడు. మాట్లాడు కుంటూ వెళ్లారు ఆటోలో.

ఇక్కడ అతనికి అర్థం కాని పాయింట్ ఒక్కటే. తనని చూసి పుస్తకం కొనటానికి వచ్చిందా, పుస్తకం కొనటానికి వచ్చి తనని

చూసిందా?

ఆ వేళ మార్చి నాలుగో తేదీ. డైరీలో ప్రసాద్ రాకతో పాటు, వాడు చెప్పిన కబుర్లతో పాటు సమానంగా ఆమె గురించే రాయకుండా ఉండలేక పోయ్యాడు. ఆ రాత్రి చాలా సేపటి దాకా నిద్ర రాలేదు. అస్పష్టమైన ఊహలతో ఊపిరాడలేదు. అరుబయట కొచ్చిపచార్లుచేశాడు ఉక్కపోస్తుంటే విసురు విసురుకుంటూ, ముసుర కుంటున్న మధురోహలను మననం చేసుకుంటూ

పది రోజులదాకా మళ్ళీ రోజులు మామూలు గానే గడిచాయి. ఓ ఆదివారం సాయంత్రం మరీ బోరుగా ఉంటే సినిమా చూద్దామని వెళ్లాడు. కొత్త సినిమా, పిచ్చరష్‌గా ఉంది. మామూలుగా టిక్కెట్లు అందే పరిస్థితికాదు. మళ్ళీ ఇంకో రోజు రావాలంటే కుదరదు. కనుకనే పదహేను

రూపాయలకు బ్లాక్‌లో టిక్కెట్లు కొన్నాడు.

మాట్నీ వదిలారు. లోపలి జనం బయట కొస్తుంటే చూస్తూ నిలబడ్డాడు. అదుగో ఆమె! ఏదో పోగొట్టుకున్న గొప్ప నిధిని తిరిగి పొందిన రిలీఫ్ పొందాడు. ఆమె పక్కనఎవరో ఉన్నారు.

స్నేహితురాలు కావచ్చు, చుట్టం కావచ్చు.

వాళ్ళను ఫాలో అయ్యాడు గేటు బయటదాకా ఆమె వెనక్కి తిరిగి చూసింది. ఆ చూపులోనే ఎన్నో పలకరింపులు ధ్వనించాయి. ఇల్లు దగ్గరే కాబోలు రిక్షా బేరమాడుకుని చిక్కడపల్లి వైపు వెళ్ళిపొయ్యారు. వెంబడించాలని అనుకున్నా ఆమె తననొక రౌడీవెధవ కింద జమ కడుతుందేమో ననుకుని ఆగిపొయ్యాడు.

డైరీలో మార్చి పదమూడో తేదీనాడు, పొద్దున వనస్థలి పురంలో చూసిన సైటు గురించి కాని, మధ్యాహ్నం చదివిన పుస్తకం గురించిగాని, సాయంత్రం చూసిన సినిమా గురించిగాని రాయ లేదు.-ఆమె మళ్ళీ కనిపించింది. మన్మథశోల లోచనాలతో పరామర్శించింది. గుండె లోతుల్లో జనించి గగన తలాన్ని తాకాలని ఎగురుతున్నాయి కడలి తరంగాలు. తెల్లారి లేచి చూసుకుంటే గడ నిండా సాలిగూళ్ళల్లా, ఎదనిండా కోర్కెలల్లు కున్నాయి. వాటిని తుడిచి పారెయ్యాలని అని పించలేదుమరి.

కానీ వేకువనే లేచి అందంగా మలుచుకున్న మంచు బొమ్మ మాత్రం ఎండపొడసోకి కరిగి పోయింది.

ఇది వరకటిలా తేలికగా ఆమెను మర్చిపోలేక పోతోంది మనసు. సూర్యుడి చుట్టూ భూమి తిరిగి నట్టు, ఆమె చుట్టూనే తిరుగుతున్నాయి ఆలోచన లన్నీ. ఎవరో? ఎక్కడుందో? ఇప్పుడేంచేస్తుందో?

కాకినాడనుంచి కజిన్ వచ్చిందనితెల్సి మారేడ్ పల్లి వెళ్ళి వస్తూ సికింద్రాబాద్ స్టేషను ముందు బస్సు కోసం నిరీక్షిస్తున్నప్పుడు మళ్ళీ దేవత సాక్షాత్కరించింది. ఒకసారి చూస్తే చప్పున తల తిప్పుకోలేని విలక్షణమైన అందం ఆమెది. ఇవాళ మరీ బావుంది. ఏదో ఫంక్షన్‌కు వెళ్ళొస్తోంది. చిలకాకు పచ్చరంగు పట్టుచీర కట్టుకుంది. కంఠానికి గంధం పూసింది. నుదుట మామూలు బొట్టుగాక మరో కుంకుమ బొట్టుకూడా ఉంది. దాహంగా ఉందేమో చెరకు రసం తాగుతోంది ఎవరితోనో మాట్లాడుతూ.

వెళ్ళకూడదనుకుంటూనే అతనూ అక్కడికి వెళ్ళాడు, చల్లదనం కోసం, చెరకు రసం కోసం. ఈ రెండింటినీ మించిన ఆమె చల్లని తీయని ఓర కంటి చూపుకోసం. చూసింది. నవ్వింది సమ్మోహనంగా. ఆ మాటలు, చూపులు పక్కనున్న స్నేహితురాలితోనో, ఇతనితోనో తెలియటం లేదు. ఊరికూరికినే నవ్వుల పువ్వులురువ్వుతోంది. ఇతని పక్కన ఎవరూలేరు. ఒక్కడే ఉత్తినే నవ్వితే పిచ్చివాడనుకుంటుందేమో. కాకపోతేగదా. ఆమె ముందుంటే పిచ్చివాడే అయిపోతాడు. ఆ సౌందర్యమూర్తి నడుస్తున్నంతమేరా వెన్నెల కాంతి విస్తరిస్తున్న భ్రాంతి.

వాళ్ళిద్దరూ వచ్చి నూట ఏదో నెంబరుబస్సు ఎక్కారు. వాళ్ళ వెనకే అతనూను. సీట్లులేవు. నిలబడ్డారు దగ్గరగానే – ఇప్పుడే ఆమె అతనికి మరింత చేరువ అయింది. బంగారంలా మెరిసిపోతూ ఎంతబావుంది! ఆమె సామీప్యం మరింత బావుంది! ఆమె కాదుగాని, ఆమె నుంచి వచ్చిన పరిమళం మాత్రం అతన్ని అతి సుతారంగా పెనవేసుకుంది. ఈమె తనదైతే ఇంక జీవితాన్ని ఎంత సురభీకృతం చేస్తుందో కదా!

జనం ఎక్కువైనారు. బస్సు బయల్దేరింది. ఇద్దరి మధ్యదూరం మరీ తగ్గిపోయింది. ఆమె స్నేహితురాలు ఏదో చెబుతోంది.అన్యమనస్కంగా వింటోంది.

కండక్టరు వచ్చాడు, నయాపూల్‌కు టిక్కెట్టు ఇవ్వమన్నాడు.

"ఇది నయాపూల్ రోడు. దిల్‌షుక్ నగర్ పోతుంది. ఎంత సేపాయె పట్నం వచ్చి?" అని సరసమాడాడు వాడు.

ఆమె ముసి ముసి నవ్వులు చిలకరించింది. ఆమె ఎక్కడ దిగుతుందో తెలీదు కాబట్టి టెర్మినెస్ దాకా టిక్కెట్టు తీసుకున్నాడు, ఒక్కొక్క నిముషం గడిచేకొద్దీ గమ్యం చేరువవుతోంది. ఇద్దరి చేతులు పైన రాడ్‌ను పట్టుకునే ఉన్నాయన్న విషయాన్ని ఏ ఒక్కరూ మర్చిపోలేదు గాని, దాన్ని గూర్చి పట్టించుకున్నట్లు మాత్రం కనిపించటం లేదు. కుదుపు వల్లా, కనిపించకుండా కదిలించటం వల్ల ఇద్దరి చేతులూ తాకినాయి. ఆ స్పర్శనుంచి కోటి కోట్ల మెగావాట్ల శక్తి శరీరంలోకి ప్రవహించింది, ఈ విషయం తెలియటం వల్లనే, తెలియనట్లు నటిస్తూ చెరోవైపు చూస్తున్నారు. అసలు స్త్రీ పురుషుల చూపులు కల్సేది, మాటలు కల్సేదీ కలవరించేడి శరీరాల కలయిక కోసమేగదా.

ఆ స్పర్శానుభూతి కలిగించి కొద్ది నిముషాలే కావచ్చు. కానీ తనువులోని ప్రాణం ఉన్నంత వరకూ గుర్తుండేది మొదటి స్పర్శ మిగిల్చిన స్మృతి మాత్రమే.

మలక్ పేటలో దిగిపోతూ అన్నది "మళ్ళీ కలుద్దాం ...ఫిర్ మిలేంగే..." ఆమె చెప్పింది ఆ స్నేహితురాలికే అయినా, అవి విన్పించేది మాత్రం ఈ స్నేహితుడికే...

మార్చి ముప్ఫయి ఒకటో తేదీన డైరీలో రాసుకున్నాడు, ఇన్నాళ్ళూ జీవితం నిరాశలనే మిగిల్చిందని బాధ పడ్డాడు. చీకటి వాకిటనే బ్రతుకు గడిచి పోతుందనుకున్నాడు.కానీ ఉజ్వలమైన తేజస్సుతో, బంగారు కిరణాలతో ఉషోదయం కాబోతోంది. మోయలేని హాయిని మోయవల్సిన సమయం తరుముకుంటూ వస్తోంది.

జగత్తు యావత్తూ నిద్రా ముద్రితమైన వేళ, కాలం సయితం సుషుప్తావస్థలో నున్న ఘడియలోనూ అతనింకా మేల్కొనే వున్నాడు. ఊహల ఊడలు పట్టుకుని ఉయ్యాల లూగుతూ, తొలిసారి నిన్ను మళ్ళీ చూసింది మొదలు, మెదిలాయి మది లోన ఎన్నెన్నో కథలు–అని పాడుకున్నాడు కూడా.

కంటికి కునుకే రాలేదు. బయటకు వెళ్ళితే చూపుల నిండా ఎదురు చూపులే.

మరో పది రోజులు అతి నిర్లిప్తంగా దొర్లిపోయినాయి. అయినా అదంతా జడం. ప్రాణం లేని స్థితి. యాంత్రికంగా మనిషి తిరుగుతున్నా మనసు మాత్రం ఎక్కడో ఉంటోంది. ఆకాంచలాలు గీసిన రంగు రంగుల కాంతి వలయాల మధ్య నర్తిస్తోంది నిర్విరామంగా.

అయినా ఆమె కంటి ముందు మాత్రం కనిపించటం లేదు. కనిపించి కదిలి పోతున్న ఈ జన సమూహాల్లో ఎక్కడైనా ఉందేమోనని వొళ్ళంతా కళ్ళు చేసుకుని వెతుకుతూనే వున్నాడు. అంతు లేని అన్వేషణే మిగిలింది. నరాల్లో నిస్సత్తువ ప్రవహిస్తోంది.

ఒకరోజు కోఠీలో మళ్ళీ దర్శన భాగ్యం లభించింది. మామూలుగానే చిరునవ్వుల చిలకరింపుల తోనే సరిపోతోందని, చొరవ తీసుకుని మాట్లాడాలని ముందుకు వెళ్ళాడు. రయ్‌మని బస్సుదూసుకుంటూ వచ్చి ఆమె ముందు ఆగింది. ముందునుంచీ ఆమె ఎక్కింది ఛెంగ్ మని.

ఆ బస్సు వదల్చుకోలేదు. అందరికి ఆఫీసుల కెళ్ళేవేళ కావటాన జనం ఫుట్ బోర్డుమీద వేళ్ళాడుతున్నారు. అతనూ వేళ్లాడాడు. బస్సు వెళ్తోంది. ఎవడో బూటు కాలుతో అతని పాదాన్ని నొక్కేశాడు. భరించలేని బాధ. పట్టు వదిలేశాడు. కింద పడి పొయ్యాడు. బస్సు ఆపారు. కొందరూ దిగి అతని దగ్గరకొచ్చారు. ఎవరో లేవదీసే దాకా లేవలేక పోయినాడు. నడుములు విరిగాయేమో.– కొందరు తిడితే, కొందరు సానుభూతి చూపారు. అవేవీ అతనికి అక్కర్లేదు. ఆమె కిటికీలో ఆత్రంగా తల బయటకు పెట్టి చూసింది. అదే అతన్ని అమితంగా బాధించింది. ఈ ఎముకలదేముంది విరిగినా రేపోమాపో అతికిస్తారు. కానీ ఆమె ముందు పగిలి పోయిన 'ఇమేజ్'ను బాగు చేయగల వాళ్ళెవరు? ఈ ఆలోచన రాగానే లేచి బలం తెచ్చుకుని ఏమీ జరగనట్టే స్పోర్టివ్‌గా లేచి నడవబోయినాడు. మోకాలు కలుక్కుమంది. నెలరోజుల పాటు మంచం దిగలేదు.

(తరువాయి 69 వ పేజి)




బుద్ధిమంతుడు

అందమైన అమ్మాయిలకు ఒక్కటి సలహా:

మీరు అందమైన అబ్బాయిని పెళ్ళి చేసుకోవాలనుకుంటే ఒక సైనికుడినే పెళ్ళాడండి. ఎందుకంటే అతను పరుపులు తయారు చేయగలడు, కుట్టగలడు, వంట చేయగలడు ముఖ్యంగా మీరు చెప్పే ఆజ్ఞలను తు.చ. తప్పకుండా పాటించగలడు.

చిత్ర జయరాం
బోధన్



(10 వ పేజి తరువాయి)

గోషనం నాటి సుఖాన్ని లంఖణాలనాడు తల్చు కున్నట్టు, మంచంలో పడి ఉన్నన్ని రోజులూ ఆమె రూపమే ఆ గదిలో తిరుగుతున్నట్టు, సేవలు చేస్తున్నట్లు అనిపించ బట్టే, తొందరగా కోలుకున్నాడు.

బ్యాంక్‌కు వెళ్ళి చెక్కు రాసిచ్చి టోకెన్ కోసం నిలబడినప్పుడు ఇంకెవరో వచ్చి చెయ్యి పెట్టారు. చూస్తే, ఎదురు చూస్తున్న వ్యక్తే! ఆమె కూడా టోకెన్ తీసుకొని ఇవతలకొచ్చింది.

"ఆ రోజు దెబ్బ బాగా తగిలిందా?" అని అడిగింది.

"అదేమంత పెద్ద దెబ్బ కాదులెండి...కొత్త దంపతులు పెళ్ళయిన కొత్తలో కొన్నాళ్ళదాకా బెడ్ మీద నుంచి దిగరట. నేను పెళ్ళికాకముందే బెడ్ దిగలేదు" అన్నాడు నవ్వుతూ.

"తమాషాగా మాట్లాడతారే" అని నవ్వింది.

"మీరు పర్మిషన్ ఇస్తే ఇంకా మాట్లాడాలని ఉందండి..."

"దానికేం భాగ్యం?"

"మరయితే సాయంత్రం కలుస్తారా?"

"సరే".

ఎక్కడ కలవాలో చెప్పాడు. వెళ్ళిపోయింది.

సాయంత్రం దాకా అతనికేమీ తోచలేదు. సంతోషం రంకెలు వేస్తోంది. మనసు పురకలు వేస్తోంది. రోడ్లమీద పరుగెత్తాలని ఉంది. ప్రిన్స్ ఛార్మింగ్ అండ్ డార్లింగ్ ఆఫ్ మిలియన్స్ నేనే నేనే...అని గట్టిగా అరవాలని ఉంది.

కదలలేని కాలం నత్త నడకలు నడిచింది. రాదనుకున్న సాయంత్రం ఎలాగో వచ్చింది. ఆ చెంతలో ఏకాంతం దొరకదనుకున్న అతని దగ్గరకు ఆమె ఒంటరిగా వచ్చింది. సహారా ఎడారిలోని నీలి నీటి సరస్సులా ఒకచోట కూర్చున్నారు. ఇద్దరికి ఎలా మొదలెట్టాలో తెలియటం లేదు.

"ఏదో మాట్లాడతానన్నారు?" ఆమే గుర్తు చేసింది.

"రెండు హృదయాలు కల్సుకున్నప్పుడు మౌనంగానే మాట్లాడుకుంటాయి" అన్నాడతను.

"ఆ మాట అన్నారు నాకు నచ్చారు" అన్నదామె.


"అనకపోతే నచ్చనన్నమాట."

"అనికాదు..." మళ్ళీ సంభాషణ తెగిపోయింది. ఏదో కదిలిద్దామని అతను అందుకున్నాడు.

"మీ చీర బావుంది"

"అంటే నేను బావోలేదన్న మాట..." సంతోషాన్ని సందేహాన్ని మిళితం చేసింది.

"అనికాదు. మీవల్ల చీరకు అందం వచ్చింది.."




"థాంక్స్... ఇంకా ఏమన్నా మాట్లాడతారా?"

"చాలా చాలా మాట్లాడతాను...చూడండి... పున్నమితోపాటు వెన్నెల వస్తుంది, వసంతం వస్తే కోయిల కూస్తుంది. నీలిమబ్బును చూస్తే నెమలి ఆడుతుంది...అంత సహజ సిద్ధంగానే, అందమైన అమ్మాయిని చూస్తే అబ్బాయి ప్రేమిస్తాడు. ఇప్పుడు నా ప్రాబ్లం కూడా అదేనండి..."

ఆమె హాయిగా నవ్వింది.

"అంత హాయిగానూ ఇంకోసారి నవ్వరా?" అని అర్థించాడు.

"బావుందండి...ఊరికినే నవ్వు ఎలా వస్తుంది?"

"ఊరికే వద్దండి. దాని ఖరీదెంతో చెప్పండి ఇచ్చుకుంటాను.."

"మీరిచ్చుకోలేనంత, నేనుపుచ్చుకోలేనంత..."

"కొన్నాళ్ళనుంచీ నన్ను ఎన్నెన్నో స్వప్నాలు వెన్నాడుతున్నాయి. వేటాడుతున్నాయి. ఈ కను రెప్పల అంచుల్ని పట్టుకుని వేలాడుతున్నాయి. మీతో మాట్లాడాలని, నిశ్శబ్దం గీసిన గిరిలో మని ద్దరం ఒద్దికగా ఒదిగిపోవాలని, అంటే... స్నేహం చేయాలని...ఉందండి...."



ప్రశ్న

టీచర్ : "పరీక్షలు దగ్గర్లో వున్నాయి. ప్రశ్నాపత్రాలు ప్రింటింగ్ ప్రెస్ కిచ్చాం. ఇక ఏమైనా అర్థం గాని ప్రశ్నలు అడగండి."

అల్లరి అబ్బాయి : ప్రింటింగ్ ప్రెస్ పేరు ఏమిటిసార్?"

చిత్ర జయరాం
బోధన్

"ఆడా మగా మధ్య స్నేహం అంటేనే మోహం. అందుకే ఆడవాళ్లు మగవాళ్ళకు దూరంగా ఉంటారు..."

"అందరి సంగతేమోగాని, నాకు మాత్రం మీరంటే చాలాచాలా ఇష్టం..., అలాగే నాగురించి మీ అభిప్రాయమూ చెప్పండి."

"మీరంటే నాకూ ఇష్టమే..."

"అయితే మనం పెళ్ళి చేసుకోవాలంటే, నేనెవరితో మాట్లాడాలి?" అని అడిగాడు గాలిలో తేలిపోతూ.

"నా భర్తతో" అందామె. పక్కన పిడుగు పడ్డట్టయింది. గొంతు తడారిపోయింది. నోట మాటరాలేదు. ఎప్పటికో తెప్పరిల్లుకుని అన్నాడు–

"సారీ, వెరీ సారీ... మీ పేరు తెలీదు. వివరాలు అంతకన్నా తెలీవు. తొందరపడి నిర్ణయాలు తీసుకున్నాను. మీ నుంచీ ప్రోత్సాహం లభించిందనుకున్నాను....నాకోసం ఏమైనా చేస్తారను కున్నాను..."

"తీగను మీటితే రాగం పలుకుతుంది. అది ఏ రాగమో సంగీత జ్ఞానం ఉన్న వాడికే అర్థం అవుతుంది... ఇప్పటి దాకా మన కలయిక లన్నీ కాకతాళీయాలేగదా. ఇదే మొదటి సారిగా మనంకావాలని కల్సుకున్న సమయం. కనుక నా విషయం చెబుతున్నాను. నాకు పెళ్ళయింది. ఒక కొడుకు కూడా ఉన్నాడు. నన్ను చూడకుండా ఆయన ఉండలేరు. బాబును చూడకుండా ఉండలేను. ఇంకా ఇంట్లో చిన్నా పెద్దా పదిమంది ఉన్నారు. వాళ్ళంతా కూడా నన్ను అమితంగా ప్రేమిస్తారు మీలాగే. ...ఆ ఇంట్లో కనిపించని మమతానుబంధాలతో నన్ను కట్టి పడేశారు. ఇప్పుడు చెప్పండి నన్నేం చెయ్యమంటారు? –" అని ప్రశ్నించింది.

అతనికి గుండె గొంతులోకి ఎగదన్నుకొచ్చింది "వద్దండి. ఇప్పుడు నా కోసం మీరేమీ చెయ్యలేరు. ఎవరూ ఏమీ చెయ్యలేరు. అయామ్ టూ లేట్...కానీ మీకు ఇష్టం ఉన్నా లేకున్నా ఒక్క విషయం మాత్రం మళ్ళీ చెబుతాను. నేను మిమ్మల్ని పిచ్చిగా ప్రేమించాను.– పిచ్చివాణ్ణయి పోతానేమో..."

"ప్రేమించిన వాళ్ళంతా పెళ్ళి చేసుకోలేరండి. వాళ్ళంతా పిచ్చివాళ్ళే అయిపోతే ఈ లోకంలో మూడొంతులు పిచ్చి ఆసుపత్రిగానే ఉండేది..."

"...నేను కన్న కలలన్నీ ఏం కావాలి?..."

"కలతోనే బ్రతకలేమని తెల్సుకోవాలి. ఊహ వేరు. వాస్తవం వేరు. మెరుపు దీపమూ కాదు. మబ్బు గొడుగూ కాదు."

"రగిలే కోర్కెలమీద కన్నీళ్ళు చన్నీళ్ళను చల్లుకుంటూ బ్రతకటం నాకు అలవాటేలెండి. ఈ జీవితం నాకు అంతులేని వేదనను, వేదాంతాన్ని మాత్రమే మిగిల్చింది. చిన్నప్పట్నించీ ఇంజనీరు కావాలని కలలు కనేవాణ్ని. ఆనవాయితీ ప్రకారం ఆ కలలూ ఫలించలేదు. అయినా బావుండేది. నా కన్నీళ్ళకు నేనే ఆనకట్టలు కట్టుకునేవాణ్ని..."

"ఒక ఆడదాని కోసం ఇంత బాధపడటం నాకు ఇష్టం లేదు. నాకన్నా అందమైన ఆడది మీకు దొరకొచ్చు..."

"మీకన్నా అందమైన ఆడదా?" వ్యంగంగా అడిగాడు.

"అవును, అసలు ఇంకో విషయం చెప్పనా? అంద చందాలు బాహ్యలోకంలో లేవు. మనం చూసే దృష్టిలోనే ఇమిడి ఉన్నాయి. మీకుఇవాళ నాలో కనిపించిన అందాలు నాలుగేళ్ళ తర్వాత కనిపించవు. మరెవరిలోనో కనిపిస్తాయి. పెద్ద పెద్ద సినిమా తారల పనే అలా ఉంటే నిత్య జీవన వికాసంలో ఇంటా బయటా నలిగిపోతున్న వాళ్ళ సంగతి చెప్పేదేముంది?..."

"నన్ను ఓదార్చటానికి ప్రయత్నిస్తున్నారు. చాలా థాంక్స్ ...నేను మాట్లాడటం అయిపోయింది..." అని లేచాడు.

ఇద్దరూ నడిచి రోడ్డు మీదకొచ్చారు. "ఎప్పుడన్నా కనపడితే పలకరించవచ్చా..." అని అడిగాడు.

"తప్పకుండా... ఏదో ఒక రోజు మీ ఇంటికే వస్తాను..."



## బాధ్యత

"మనపరిధిలో మరిన్ని క్రొత్తగా పోలీస్‌స్టేషన్లు ఏర్పాటుచేస్తారట" పేపరు చదువుతూ అన్నాడు అనుచరుడు.

"అయితే ఆడవాళ్ళను కాపాడవలసిన బాధ్యత మనమీద మరింత పడిందన్నమాట" నిర్లిప్తంగా అన్నాడు దొంగల నాయకుడు.

టీ. రాజేష్
బెల్లంపల్లి

"మాఇంటికే తీసుకెళ్ళాలనుకున్నాను. కాని వీలు పడదు లెండి. స్నేహం మోహం అనకుండా ఉంటే కొద్దికాలం పాటు, కనీసం ఈ గాయం మానేంతవరకు మిమ్మల్ని కలుస్తుంటాను. అభ్యంతరమా?..."

"ఎంతమాత్రమూ లేదు. తప్పకుండా......"

ఆమె ఆఫీసు నెంబరు చెప్పింది. కాగితం దొరక్క అరచేతిలో రాసుకున్నాడు.

"చెరిగి పోతుందేమో?..." అంది అతని అరచేతిలోని అంకెల వంక చూసి.

"ఎలాగూ చెరిగి పొయ్యేదే లెండి..." అన్నాడు.

"జీవితంలో ప్రతి విషయాన్నీ సీరియస్‌గా తీసుకో కూడదు"-ఆమె.

"జీవితంలో ప్రతి విషయాన్నీ తేలికగా తీసుకోకూడదు"-అతను.

"వస్తాను...బై..."

"బై..."

ఆమె వెళ్ళిపోయింది చీకటిని మిగిల్చి.

ఆవేళ తొమ్మిదో తేది. డైరీలో ఆ పేజీ తీసుకున్నాడు. 'ఇవాళ నాకు గొడ్డు అమావాస్య-' అని ఒక్క వాక్యం మాత్రమే రాసుకున్నాడు.

అంతకు ముందు పేజీ తిరగేశాడు. ఒక కవి గారి మాటలు నోట్ చేసుకున్నాడు - 'నీవు నిండుగ నవ్వినపుడే, నాకునిజముగ తెల్లవారును-' దానికిందే గుర్తుగా మరో రెండు మాటలుచేర్చాడు.

'ఇంకోసారి నవ్వండి. దాని ఖరీదెంతో ఇచ్చుకుంటాను?

మీరిచ్చుకో లేనంత, నేనుపుచ్చుకోలేనంత...'

తినటం, తిరగటం అంతా మామూలుగానే చేస్తున్నా దేనిలోనూ ఆసక్తి లేదు. ఏదో డ్యూటీగా అన్ని పనులూ చేయటం, పలకరిస్తే ముక్కుబడిగా మాట్లాడటం.

మూడు వారాల తర్వాత, కోరికను ఆపుకోలేక ఫోను చేశాడు. ఆమె లైనులోకి వచ్చింది.

"ఎవరూ, మాట్లాడుతూంట?"

"మీ స్నేహంతోపాటు, తలవని తలంపుగా కల్సుకునే కలయికకూ నోచుకోని నిర్భాగ్యుడు..."

"మీరా, బావున్నారా?"

"మీరేనా ఆమాట అడుగుతున్నది..."

..."ఏమిటి విశేషాలు?"

"నా కన్నీ అవశేషాలే కనిపిస్తున్నాయి."

"ఏమిటా మాటలు?"

"ఖాళీగా ఉన్న గుండె గదిలోని ప్రతిధ్వనులు... ఒకసారి చూడాలని ఉంది. ఎప్పుడు వీలవుతుంది? ఇవాళ సాయంత్రం?"

"ఇవాళా, అబ్బే వీలు పడదు."

"ఏం?"

"మా వారికి ట్రాన్స్‌ఫరైంది. నేను లీవు పెట్టాను. రేపు వెళ్ళి పోతున్నాం. ఇవాళ సామాన్లు సర్దుకోవాలి. ఇంట్లో బోలెడు పనిఉంది..."

"చెప్పకుండానే వెళ్ళిపోతున్నారన్నమాట..."

"చెబుదామనుకుంటున్నాను. నేనే ఫోన్ చేద్దామనుకుంటున్నాను. మీ పిలుపు వచ్చింది..."


"అయితే రేపు స్టేషను కొస్తాను. ఏ రైలుకి?"

ఆమె చెప్పింది. ఆ వేళ మే ముప్పయి. డైరీలో రాసుకున్నాడు. స్నేహాలు చేయటం బహుతేలిక. వాటిని నిలుపు కోవటం చాలా కష్టం.

మర్నాడు ఆమెకన్నా ముందే, రైలు కన్నా ముందే రైలు స్టేషను కెళ్ళాడు. తర్వాత ఎప్పుడో రైలు వచ్చింది. ఆమె వచ్చింది.

కంపార్టుమెంటులో వాళ్ళ బెర్తులు చూసుకుని కూర్చున్నారు. సామాను సర్దుతూ ఆమె భర్త పలకరించాడు. "అప్పర్ బెర్తు మీదా?"

అవునసీ అనలేదు. కాదనీ అనలేదు. ఇంకా కొంత సామాను మరెవరో మనుష్యులూ అవతల కంపార్టుమెంటులో ఉన్నారు కాబోలు అక్కడి



కెళ్ళాడు. అతడూ అందంగానే ఉన్నాడు. ఆమె కొడుకు ఒళ్ళోనే ఒదిగి పోతున్నాడు.

"నా గుర్తుగా ఈ పుస్తకాన్ని ఉంచుకోండి" అన్నాడతను. ఆమె తీసుకొంది.

పుస్తకం పేరు 'చితి - చింత' మొదటి పేజీలో స్కెచ్ పెన్‌తో రాశాడు.

'ఒక నేస్తం కోసం చచ్చిపోవటం గొప్పకాదు. అంతటి అర్హత గల గొప్పనేస్తం దొరకటమే గొప్ప విషయం - హెూస్రీహోమ్' పుస్తకం మూసి అతనితో అన్నది -

"థాంక్యూ వెరీ మచ్...కానీ మీ కివ్వటానికి నాదగ్గరేమీ లేదు..."

"ఇప్పుడు నేను మీ నుంచి ఏమీ ఆశించటం లేదు. ఇది ప్రతిఫలాపేక్షలేని ఆపేక్ష మాత్రమే..."

"కానీ నా జ్ఞాపకంగా ఏదన్నా ఇవ్వాలనిఉంది ...ఏమీ అనుకోక పోతే ఈచిన్న జేబుగుడ్డను మీ దగ్గర భద్రంగా ఉంచండి. ఎప్పుడన్నా గుర్తొస్తాను...."

ఆమె అందించిన జేబుగుడ్డతో పాటు గుప్పుమని సువాసనా అతని అరచేతుల్లోకి వచ్చింది.

ఇంతలో ఆమె భర్త కిటికీ దగ్గరకొచ్చాడు. ఇంకేమన్నా కావాలా అంటూ. బాబుకూల్ డ్రింక్ కోసం పేచీ పెట్టాడు. తండ్రి వాణ్ని తీసుకుని వెళ్ళాడు.

"మళ్ళీ ఎప్పుడన్నా...ఎక్కడున్నా...కనిపిస్తారా?" అడిగాడు.

"ఏమో, ఏం చెప్పగలను? ఇలాగే ఎప్పుడన్నా తటస్థ పడొచ్చు..." అన్నదామె చిన్నగా.

"ఎప్పటికీ తటస్థ పడకపోనూ వచ్చు..." అని గొణుక్కున్నాడు.

పక్కన ఎవరో ట్రాన్సిస్టర్ తెచ్చినట్లున్నారు పాట వినిపిస్తోంది. తేరేమేరే బీచ్ మే కైసాహై యే బంధన్, అంజానా —

"నేను గుర్తుంటానా?" అని అడిగాడు మళ్ళీ.


"ప్రేమించినవాణ్ణి పెళ్ళిచేసుకోలేక పోవచ్చు. కానీ ప్రేమించినందుకు మాత్రం ఆ స్త్రీ అతణ్ణి జీవితాంతం అంతరాంతరాల్లో ఆరాధిస్తూనే ఉంటుంది. ఇంతకన్నా ఇంకేం చెప్పను?" అన్నది కిటికీలోనుంచి బయటకు చూస్తూ.

ఇద్దరూ ఎవరి ఆలోచనల్లో వాళ్ళు ఉండిపోవటంతో టైం చూసుకోలేదు.

ఎవరో ఎవరితోనో "ఫిర్ మిలేంగే" అనటంతో ఇద్దరూ ఉలిక్కిపడ్డారు. రైలు చిన్నగా కదులుతోంది.

"ఇంక వెళ్ళండిమరి" అన్నదామె సుళ్ళు తిరుగుతున్న కన్నీళ్ళతో.

ఆఖరిసారి ఆమెనుచూసి అక్కడ్నించి కదిలాడు.




రైలు వేగం పుంజుకుంటోంది. తలుపుదగ్గర ఎవరో ఇద్దరు అడ్డంగా నిలబడ్డారు. వాళ్ళను నెట్టుకుంటూ ముందుకెళ్ళాడు.

ఆమెభర్త పిల్లాణ్ణి ఎత్తుకుని పరుగెత్తుకు వస్తున్నాడు. ఒక చేతిలో పిల్లాడు; మరోచేత్తో కడ్డీ పట్టుకున్నాడు. కిందమెట్టు అందలేదు. జారిపోతున్నాడు. ఇతను అతన్నీ; పిల్లాణ్ణి కలిపి తన రెండోచేత్తో గట్టిగా పట్టుకు లాగుతున్నాడు పడిపోకుండా. తర్వాత అతను మెట్టుమీద కాలు పెట్టాడు. ఒక్క ఊపుతో లోపలికి రాబోయినాడు. ఆ ధ్యాసలో అనుకోకుండానే ఆమెభర్త ఇతన్నితోసేశాడు. ఇతను పట్టుజారి కిందకు పడిపోయ్యాడు.

అప్పటికే ఈ బోగి ప్లాట్‌ఫారం దాటి రావటం వల్ల ఇతను సరాసరి రైలుచక్రాల కిందికే వెళ్ళిపోయ్యాడు.

ఫర్లాంగుదూరం వెళ్ళి రైలు ఆగింది. చాలా మంది దిగివెళ్ళారు. ఆమె భర్తకూడా వెళ్ళాడు. చూసొచ్చినవాళ్ళు విశేషాలు చెబుతున్నారు.

అతని పిడికిట్లో జేబుగుడ్డ ఇంకాఅలాగేఉందిట.

ఆమె చెంపలమీదనుంచి జలజలా రాలిపడుతున్న కన్నీటిని, బాబు తన లేతచేతులతో తుడిచే ప్రయత్నం చేస్తున్నాడు.

*



**ఊహ**

లయైనది
నిజంకానిది
మధురమైనది
మరులు కొనినది
ఊహ మాత్రమే!

—హాస్నోరవి


TECHNICAL

**DRAUGHTSMAN** Mechanical
*One year 1½ hours daily 5 days a week from: 6 July 84.*

**DRAUGHTSMAN** (Civil)
One year 1½ hours daily, 5 days a week from: 6 July 84.

**AUTOMOBILE ENGINEERING**
One year 2 hours daily, 6 days a week from: 6 July 84.

**REFRIGERATION-AIR-CONDITIONING**
*Full time* 2.00 pm to 5.00 pm 8-6-84.
*Part time* 6.30 pm to 8.00 pm

**DATA ENTRY OPERATOR**
**Key to Diskettes. One hour daily-any day-5 weeks. Matriculates with English medium.**

ENGLISH

*Learn to speak English fluently Command over the language can be yours in just 8 Weeks 6 days a week 42 sessions.*
*Ladies only from 11 A.M. to 12.30 P.M.*
*Ladies and Gents 2.00 P.M. 3.30 P.M. 6.30 P.M. 8.00 P.M. 8-6-84.*

TELEX - RECEPTIONIST
TELEPHONE OPERATOR

4 Weeks duration - 4 days a week-one hour daily-evenings. From 8-6-84.

dc Datamaticscorporation
Datamatics House, Near Liberty Cinema,
Basheerbagh, HYDERABAD Phone 222626.